

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 27.0
తణుకు : 30.0 - 26.0

మేమున్నాం.. ఆదుకుంటాం





- తణుకు మండలం దువ్వ-సూర్యారావు పాలెం మధ్య ఇంకా ముంపులోనే వున్న వరి పొలాలు.. కుళ్లిపోయిన నాట్లు
- ఇంకా ముంపులోనే..

వరద బాధితులకు మంత్రుల భరోసా

'మీరు అధైర్యపడవద్దు. మీకు అండగా మేమున్నాం.. ఆదుకుంటాం' అంటూ భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న రైతులకు రాష్ట్ర మంత్రులు కె.అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి, వంగలపూడి అనిత భరోసా ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు, తణుకు, అత్తిలి, పెనుమంట్ర మండలాల్లో నీట మునిగిన పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. బాధితులకు వరద సాయం అందించారు. వారి వెంట ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, కలెక్టర్లు వెట్రి సెల్వి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు. 7లో..



దువ్వలో గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు

మళ్లీ ముంచుకొస్తోంది

అనూహ్యంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

- భద్రాచలంలో మూడు, ధవళేశ్వరంలో రెండో ప్రమాద హెచ్చరిక.. వణుకుతున్న వేలేరుపాడు
- కుక్కునూరు-భద్రాచలం మధ్య రాకపోకలు బంద్.. ముంపులోనే వరి పొలాలు
- ఐదు రోజులుగా కనకాయలంక కాజ్‌వేపై పడవ ప్రయాణం.. ఉధృతంగా వశిష్ఠ



కుక్కునూరు : ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు మధ్య రహదారిపై ప్రవహిస్తున్న గోదావరి వరద

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం/ఆచంట/నరసాపురం టౌన్, జూలై 27 : గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 53 అడుగులు దాటడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని కేంద్ర జలవనరుల శాఖ వెల్లడించడంతో కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, పెనుగొండ, ఆచంట, యలమంచిలి గోదావరి తీర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. కుక్కునూరు గ్రామ శివారులోకి వరద నీరు ముంచుతోంది. ఇక్కడి వారిని కివ్వాక పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని అధికారులు ఆదేశించారు. పుల్లప్పగూడెం సమీపంలోకి గోదావరి వరద వచ్చి చేరింది. వెంకటాపురం ఎస్సీ కాలనీకి వెళ్లి రహదారిలో గోదావరి వరద నీట మునిగింది. గోదావరి మరింత పెరిగితే గొమ్ముగూడెం పంచాయతీలోని ఉప్పర మద్దిగట్లతోపాటు అంబోతులగూడెం, చెరువు కొమ్ముగూడెం గ్రామాలు ముంపు బారిన పడనున్నాయి. వారం రోజులుగా వేలేరుపాడు మండలంలోని 30 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గోదావరి ఉపనది తాళిపేరుకు వరద పోటెత్తడంతో లక్షా 20 వేల క్యూసెక్కుల నీటిని దిగువన వున్న గోదావరిలోకి వదిలారు. తెలంగాణలోని గోదావరి పరివాహక జిల్లాలైన భద్రాద్రి, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిర్మల్ తదితర జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు కారణంగా వరద నీరు గోదావరికి పోటెత్తుతోంది. ఈ జిల్లాల్లో మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. భద్రాచలం వద్ద నీటిమట్టం 57 అడుగులకు చేరుకుంటే వేలేరుపాడులో వరద నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తుంది. ఇప్పటికే సంత మార్కెట్ సెంటర్‌లోని ఇళ్లలోకి నీరు ప్రవేశించటంతో వాటిని ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం వరద మండల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. జల దిగ్బంధంలో చిక్కుకున్న 30 గ్రామాలతోపాటు మరికొన్నింటిని వరద చుట్టుముట్టే ప్రమాదం ఉండటంతో అధికారులు అక్కడి ప్రజలను తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. 53 అడుగులకు చేరుకోగానే 3వ ప్రమాద హెచ్చరికను జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వేలేరుపాడులోనే ఉండి వరద పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగి 24.027 మీటర్లకు చేరుకుంది. ధవళేశ్వరం వద్ద 24.42 మీటర్లకు చేరింది. 13 లక్షల క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు, రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ధవళేశ్వరం బ్యారేజి డీఈఈ రమేష్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు 48 గేట్ల ద్వారా 11,64,264 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి కుడి కాలువకు 15 పంపులతో 5,310 క్యూసెక్కుల జలాలు విడుదల చేశారు.



ఆచంట : పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద ముందుకు వస్తున్న గోదావరి





యలమంచిలి : కనకాయలంక కాజ్ వే వద్ద పడవలపై రాకపోకలు సాగిస్తున్న గ్రామస్థులు
దొడ్డిపట్ల పల్లిపాలెంలో ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు

పశ్చిమలో.. ఉధృతి

రెండు రోజుల క్రితం కాస్త తగ్గిన గోదావరి శనివారం మధ్యాహ్నం నుంచి స్వల్పంగా పెరగడంతో ఆచంట మండలం కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ కారణంగా గోదావరిలో పడవలు నామమాత్రంగా తిరుగుతున్నాయి. లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నీట మునగడంతో కొన్నిచోట్ల పశుగ్రాసం దెబ్బతింది. ఇక్కడ మూగ జీవాలకు పశుగ్రాసం ఇచ్చే ఏర్పాట్లు చేయాలని లంకవాసులు కోరుతున్నారు. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే ఐదు రోజులుగా వరద ముంపులోనే ఉండటంతో ఆ గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు పడవలనే ఉపయోగిస్తున్నారు. వర్షాలు, వరదల ప్రభావంతో మురుగు కాలువలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరి చేలు ముంపులోనే ఉన్నాయి. ముఖ్యంగా లంకగ్రామాల్లో పాడి రైతులు పశువులకు పచ్చగడ్డి దొరకడం లేదని వాపోతున్నారు. మండలంలోని గ్రామాల్లో పుష్కర ఘాట్‌లు ముంపులోనే ఉన్నాయి. ఎగువ ప్రాంతాల్లో వరద పెరుగుతుందన్న సమాచారంతో లంకగ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి వరద ఉధృతి తగ్గలేదు. పరవళ్లు తొక్కుతుంది. పిండాల రేవు గుండా వరద నీరు సముద్రంలోకి దూసుకుపోతోంది. గంట గంటకు నీట మట్టాలు పెరుగుతున్నాయి. వరద పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అలర్ట్ అయ్యారు. రేవుల్లో ఎవరిని స్నానాలకు దిగనివ్వడం లేదు. వలంధర్ రేవు వద్ద పోలీస్ పికెట్ పెట్టారు. ఏటిగట్టుపై పహారా పెంచారు. బలహీనంగా ఉన్న గట్లపై ఇసుక బస్తాలను వేస్తున్నారు.

ఇసుక మంట



స్టాక్ పాయింట్లలో బ్లాక్ మార్కెట్ దందా

- బిల్లు రూ.4,900.. వసూలు చేసింది రూ.11 వేలు
- కొంత సొమ్ము స్థానిక ప్రజా ప్రతినిధి కోసమట!
- లారీ ఇసుక : ఏలూరులో రూ.26 వేలు, భీమవరంలో రూ.23 వేలు.. వినియోగదారుల బెంబేలు

పాలకొల్లు, జూలై 27: ఉచిత ఇసుక బ్లాక్ మార్కెట్ పరమైంది. సామాన్యులకు అందని ద్రాక్షగా మారుతోంది. పది రోజులుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రావులపాలెం స్టాక్ పాయింట్ మినహా మిగిలిన అన్నిచోట్ల ఇసుక ఎగుమతులు నిలిచిపోయాయి. ఇక్కడ మాత్రం రోజుకు 200 లారీల ఇసుక ఎగుమతి అవుతోంది. లోడింగ్, ట్రాన్స్‌పోర్టు చార్జీల నిమిత్తం రూ.4,900 వసూలు చేయాలి. అంతే మొత్తంలో బిల్లు ఇస్తూ రూ.11 వేలు వసూలు చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఇలా వసూలు చేసిన మొత్తంలో అక్కడి ఓ ప్రజా ప్రతినిధికి రూ.6,100 ఇస్తున్నామని స్టాక్ పాయింట్ సిబ్బంది చెబుతున్నట్టు లారీ ఓనర్లు చెబుతున్నారు. ఈ లెక్కన రోజుకు 200 లారీల ఇసుక ఎగుమతివుతుంటే రూ.12 లక్షలు ఆ నేత జేబులోకి వెళుతోందన్న మాట.

రూ.20 వేలు పైమాటే

తూర్పు, పశ్చిమ, కోనసీమ జిల్లాల్లోని స్టాక్ పాయింట్లు, పడవల ర్యాంపుల్లో ఇసుక ఎగుమతులు నిలిచిపోవడంతో రావులపాలెం స్టాక్ పాయింట్ సిబ్బంది ఇష్టానుసారం వసూలు చేస్తున్నారు. 20 టన్నుల ఇసుక లారీ (4.5 యూనిట్లు) ఏలూరులో రూ.26 వేలు, తాడేపల్లిగూడెం, భీమవరంలలో రూ.23 వేలు, పాలకొల్లు, నరసాపురం రూ.21 వేలకు అన్‌లోడ్ చేస్తున్నారు. జగన్ సర్కార్ హయాంలో వరదల సమయంలోనే ఐదు యూనిట్ల ఇసుక లారీ రూ.18 వేలకు మించి లేదు. ఇప్పుడు ఉచితం అంటూ నిలువుదోపిడీ చేస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 20 రోజులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్మాణ రంగం పడకేసింది. ఓ వైపు ఎడతెరిపి లేని వర్షాలు, మరోవైపు ఇసుక కొరత నిర్మాణ పనులకు ఆటకం ఏర్పడింది. ఈ విషయాలపై ఫిర్యాదులు రావడంతో సీఎం పేషీ దృష్టి సారించింది. బిల్లుకన్నా అదనంగా వసూలు చేస్తున్న వైనంపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరినట్లు సమాచారం.

సీఎం దృష్టికి వ్యవహారం

వరదలు తగ్గుముఖం పట్టి, గోదావరి ర్యాంపులలో బాటల ఏర్పాటుకు మరో రెండు నెలలు సమయం పడుతుంది. అప్పటి వరకు ఇసుక అమ్మకాల తీరు ఇదే విధంగా కొనసాగితే అభాసుపాలవుతామని తమ కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, ఇప్పటికే సీఎం దృష్టికి పలువురు ప్రజా ప్రతినిధులు తీసుకుని వెళ్లారు. మరోవైపు పెండ్యాల, తీపర్రు, కుమారదేవం, స్టాక్ పాయింట్లలో శనివారం నుంచి ఇసుక ఎగుమతులు ప్రారంభించారు. పెండ్యాలలో పది లారీల ఇసుక ఎగుమతి చేశారు. ఇసుక ఎగుమతులకు వెళ్లిన లారీలు రోజుల తరబడి స్టాక్ పాయింట్లలో వేచి ఉండటం, వెయిటింగ్ పీరియడ్‌కి కిరాయి అదనంగా వసూలు చేస్తే దానినే బూతద్దంలో చూపించి, లారీ యజమానులు ఎక్కువ సొమ్ములు వసూలు చేస్తున్నారనే చెడ్డ పేరును ట్రాన్స్‌పోర్టర్లకు అంట గడుతున్నారనే అంశాలను టిప్పర్ లారీ యజమానాలు ఆయా జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ వసూళ్ళపై దృష్టి పెట్టాలని లారీ యజమానులు కోరుతున్నారు.

ఏదీ ఓఎన్‌జీసీ పరిహారం

- పనులు పూర్తయినా.. ఇవ్వని అధికారులు
- రెండు రోజుల్లో చెల్లిస్తారంటున్న వీఆర్వో



నరసాపురం రూరల్, జూలై 27 : రెండేళ్ళ క్రితం సీతారాంపురం గ్రామ భూగర్భంలో గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు ఓఎన్‌జీసీ అధికారులు గుర్తించారు. అక్కడ స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడ నుంచి పైప్‌లైన్ గుండా పట్టణంలోని రుస్తుంబాద టెంపుల్ ల్యాండ్‌కు తరలించేందుకు ప్లాన్ చేశారు. అయితే పైప్‌లైన్ మార్గం ఏర్పాటుపై రైతులు అభ్యంతరం తెలిపారు. పంట పొలాలు కింద పైప్‌లైన్ ఉంటే తమ భూములు ఎవరూ కొనుగోలు చేయరని ఆందోళన చేశారు. నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనలకు అప్పట్లో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, బొమ్మిడి నాయకర్ అండగా నిలిచారు. అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఓఎన్‌జీసీ, రైతులతో సమావేశమై చర్చలు జరిపారు. 110 మంది రైతులకు రూ.35 లక్షల పరిహారం చెల్లించి, ఐదేళ్ళ తర్వాత పైప్‌లైన్లు తీసివేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. మూడు నెలల క్రితం ఓఎన్‌జీసీ పైప్‌లైన్ పనులను పూర్తిచేసింది. గ్యాస్ నిక్షేపాలు గుర్తించిన సీతారాంపురం నుంచి వైఎస్ పాలెం, రుస్తుంబాద మీదుగా ఓఎన్‌జీసీ పైప్‌లైన్ పనులు పూర్తిచేశారు. పనులు పూర్తయినా.. ఇంత వరకు హామీ ఇచ్చిన విధంగా పరిహారం చెల్లించలేదు. అదిగో అంటూ కాలయపాన చేస్తున్నారు. దీంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త కలెక్టర్ నాగరాణిని కలిసి పరిహారంపై వినతి పత్రం అందించారు. దీనిపై వీఆర్వో చిరంజీవి వివరణ ఇస్తూ పరిహారం చెల్లింపులో బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేకపోవడం ఇబ్బందులు వచ్చాయని, రెండు, మూడు రోజుల్లో అందరికీ పరిహారం పడనున్నట్లు చెప్పారు.

రేవు పాటపై వచ్చే వారం నిర్ణయం

నరసాపురం రూరల్, జూలై 27 : 'మాధవాయిపాలెం రేవు పాటను రూ.3.61 కోట్లకు పాడుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీనిపై వచ్చే వారం జేపీసీ సమావేశాన్ని నిర్వహించి ప్రారంభ పాట తగ్గింపుపై ఒక నిర్ణయం తీసుకుని నోటిఫికేషన్ ఇస్తాం' అని ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరభద్రరావు చెప్పారు. ఇప్పటికే మూడుసార్లు నోటిఫికేషన్ ఇచ్చాం. ప్రస్తుతం మండల పరిషత్ ఆధ్వర్యంలో రేవు నిర్వహణ జరుగుతోంది.

నగరానికి విలీనమే అడ్డు



- భీమవరం మునిసిపాలిటీలో కలిసేందుకు గ్రామాలు అభ్యంతరం
- వీటిని అధిగమించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- ప్రభుత్వ స్థాయిలోనే నిర్ణయం.. అప్పుడే విలీనం సుగమం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరం మునిసిపాలిటీ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యేందుకు విలీన గ్రామాలే ప్రధాన అవరోధంగా మారుతున్నాయి. ఆర్థిక వనరుల రీత్యా కార్పొరేషన్ అయ్యేందుకు అర్హత ఉన్నప్పటికీ, జనాభాను పరిగణనలోకి తీసుకుంటే గ్రామాలు తప్పనిసరిగా విలీనం కావాలి. పట్టణంలోకి సమీప గ్రామాలైన రాయలం, చిన అమిరం, తాడేరు, కొవ్వాడ అన్నవరం గ్రామాలను విలీనం చేసేందుకు అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విలీనం చేస్తూ రికార్డులను స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాలిటీ ఆ దిశగా చర్యలు తీసుకుంది. కాని, ఈ నాలుగు గ్రామాల ప్రజా ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. ఫలితంగా విలీన ప్రక్రియ నిలిచిపోయింది. హైకోర్టు స్టే విధించింది. దీనిని తొలగించేందుకు మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలి. అడ్వకేట్ జనరల్ స్థాయిలోనే న్యాయ పోరాటం చేయాలి. దీనిపై భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు పట్టణాన్ని కార్పొరేషన్ దిశగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జగన్ సర్కార్ హయాంలో కొన్ని గ్రామాలు మాత్రమే విలీనానికి చర్యలు తీసుకున్నారు. పట్టణాని కి ఆనుకుని వున్న గొల్లల కోడేరు, విస్సాకోడేరు, పెద అమిరం గ్రామాల జోలికి పోలేదు. మూడు గ్రామాలు ఉండి నియోజకవర్గ పరిధిలో ఉండడంతో విలీనానికి ప్రభుత్వం చర్యలు తీసుకోలేక పోయింది. అయితే ప్రస్తుతం పట్టణ జనాభా 1.65 లక్షలు. గ్రామాలు విలీనమైతే మరో 20 వేలు పెరుగుతుంది. భీమవరం చుట్టూ వున్న గ్రామాలు కలిస్తే రెండు లక్షలు దాటుతుంది. కార్పొరేషన్ ఏర్పాటుకు ఇబ్బంది తొలగుతుంది. ప్రభుత్వ పరంగా అధిక నిధులు మంజూరవుతాయి. పట్టణ విస్తరణకు అవకాశం ఉంటుంది. జిల్లాలోనే ఆర్థికంగా బలోపేతమైనదీ పట్టణం. కార్పొరేషన్‌గా ఎదిగేందుకు అవసరమైన మౌలిక లక్షణాలు దీనికి ఉన్నాయి. విద్యా సంస్థలు, జాతీయ రహదారులు, రైలుమార్గం ఉంది. కార్పొరేట్ వైద్య సదుపాయాలు అందుతున్నాయి. కార్పొరేషన్ అయితే మౌలిక వసతులు మరింత పెరుగుతాయి. పట్టణం విశాలంగా అభివృద్ధి చెందే ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం మున్సిపాలిటీకి ఏటా రూ.35 కోట్ల మేర ఆదాయం లభిస్తోంది. కార్పొరేషన్ అయితే రూ.50 కోట్లకుపైనే సమకూరుతుంది. జిల్లా కేంద్రం కూడా కావడంతో మరింత అభివృద్ధి చెందుతుంది. వైసీపీ హయాంలో లోపభూయిష్టమైన విధానాలు, ఆ పార్టీ నేతల వైఖరితో పట్టణంలో నిర్మాణ రంగం కుదేలైంది. గడచిన ఐదేళ్లలో కొత్తగా ఒక అపార్ట్‌మెంట్ కూడా నిర్మాణానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నారు. మరోవైపు జిల్లా కేంద్రాలను కార్పొరేషన్‌లుగా తీర్చిదిద్దాలంటూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలో కార్పొరేషన్‌గా మారే తొలి అర్హత భీమవరం పట్టణానికి ఉంది. ప్రస్తుతం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు అందుబాటులో ఉంది.



బస్సులు ఢీకొని..

- కలపర్రు టోల్‌గేట్ వద్ద, బాదంపూడి వై.జంక్షన్ వద్ద జరిగిన రెండు వేర్వేరు ప్రైవేటు బస్సు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. వీరిని ఆసుపత్రులకు తరలించి చికిత్స చేయించారు. 7లో

వరదలను సమష్టిగా ఎదుర్కొందాం : కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 27 : 'గోదావరి వరద పరిస్థితులను అధికారులు సమష్టిగా సమర్థవంతంగా ఎదుర్కొందాం. ఎక్కడ లోటు కనిపించినా ఆయా శాఖల అధికారులు, సిబ్బందే బాధ్యత వహించాలి' అని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. గోదావరి వరద ఉధృతి, ముందస్తు చర్యలపై భీమవరం కలెక్టరేట్‌లో శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గోదావరి వరద ఇంకా ఉధృతంగా కొనసాగుతున్న దృష్ట్యా లంక గ్రామాల ప్రజలకు భోజన, వసతి, తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి. పశువులు నష్టం జరగకుండా, సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడాలి. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలు, సర్వే బాదులు, వెదురు తడికెలు తదితర సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలి' అని సూచించారు. సమీక్షలో డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, ఆర్డీవోలు కె.శ్రీనివాసులురాజు, యం.అచ్యుత అంబరీష్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు బి.శివరాయణరెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఈ దక్షిణామూర్తి, డీఈ సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో ఉదయ భాస్కరరావు

నేటి నుంచి ఏపీపీఎస్‌సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు

ఏలూరు రూరల్/ భీమవరం టౌన్, జూలై 27: ఏపీపీఎస్‌సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఏలూరు ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీ, పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు వేర్వేరు సమావేశాల్లో అధికారులకు సూచించారు. ఈనెల 28 నుంచి నిర్వహించే పరీక్షలపై పోలీస్, విద్యుత్, వైద్యశాఖ పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజన్ అధికారులతో శనివారం ఆయా జిల్లా కేంద్రాల్లో సమావేశం నిర్వహించారు. ఈనెల 28 నుంచి ఆగస్ట్ 2వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఏలూరు జిల్లాలో 1052 మంది, పశ్చిమలో 860 మంది పరీక్షలు రాయనున్నారు.ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షాపత్రం ఉంటుందన్నారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, గంట ముందు కేంద్రానికి హాజరు కావాలన్నారు. వట్లూరు సిద్ధార్థ పాఠశాల, భీమవరంలో డీఎన్ఆర్ కళాశాల, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయి.

భీమవరంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు

భీమవరం అర్బన్, జూలై 27: చదరంగం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చవాకుల నరసింహారావు అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అండర్ 11 రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ భవనంలో శనివారం ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ కోశాధికారి జ్వాలాముఖి మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలు తెలంగాణలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసి కిషోర్ మాట్లాడుతూ 20 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నారన్నారు. రాష్ట్ర చదరంగం అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉదయ్ కుమార్, విజ్ఞాన వేదిక సేవ సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 3,4 తేదీల్లో జాతీయస్థాయి నర్తనబాల అవార్డుల ప్రదానం



బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు రూరల్, జూలై 27: ఏలూరుకు చెందిన అభినయ నృత్యభారతి ఆధ్వర్యంలో ఆగస్ట్ 3,4 తేదీల్లో వైఎంహెచ్ఏ ప్రాంగణంలో జాతీయ స్థాయి నర్తన బాల అవార్డుల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గౌరవ అధ్యక్షుడు అంబికా కృష్ణ, వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ గోపాల్ లూనాని, జి.హేమసుందర్ తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 40 మంది నాట్యగురువుల శిష్యులు 170 మంది నృత్య ప్రదర్శనలు చేయనున్నారని వారికి సంస్థ తరపున నర్తనబాల అవార్డుతో సత్కరిస్తామన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు హాజరవుతారన్నారు. బ్రోచర్‌ను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆవిష్కరించారు.

ఆదుకుంటాం..

“ వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధితుల దగ్గరకు వెళ్లండి.. ఇప్పటి వరకు అందిన సాయం..? ఇంకా ఏం కావాలో తెలుసుకోండి.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అందుకే మేమంతా కలిసి వచ్చాం..” అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం మంత్రుల బృందం ఉమ్మడి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.. బాధితులను పరామర్శించి వారికి సాయం అందిస్తామని చెప్పారు.

- ఇది ప్రజా ప్రభుత్వం..సేవ చేసేందుకే ఉన్నాం
- జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ కష్టాలు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రులు అచ్చెన్నాయుడు, రామానాయుడు, పార్థసారథి, అనిత
- ఆదుకుంటామంటూ బాధితులకు భరోసా

కుక్కునూరు, జూలై 27: తమది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు ఏ ఇబ్బందులు తలెత్తినా తక్షణమే స్పందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించటంతో ప్రజల ఇబ్బందులు తెలుసుకుంటున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. దాచారం పునరావాస కాలనీలో బాధితులతో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వరద ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో సహాయం అందించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. వరద ప్రమాదం తగ్గిన తరువాత బాధితులను ఇంటి వద్దకు క్షేమంగా చేరేలా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు ద్వారా 14 వేల ఎకరాలు ఆంధ్రప్రదేశ్‌లో సాగవుతుందని పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులకు, గోదావరి బోర్డు 85 శాతం ఆంధ్రప్రదేశ్, 15 శాతం తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. అయితే 80 కోట్ల రూపాయలు మరమ్మతులకు అంచనాలు రూపొందించగా గత ప్రభుత్వం తన వాటా చెల్లించకుండా పెడచెవిన పెట్టిందన్నారు. ఆ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెదవాగు ప్రాజెక్టు మరమ్మత్తులకు ప్రణాళికలు రూపొందించి బడ్జెట్ కేటాయిస్తామన్నారు. మంత్రి పార్థసారధి మాట్లాడుతూ గోదావరి వరదల కారణంగా నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకి ఎంతో మేలుచేసే పోలవరం ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు నష్టపరిహారం త్వరితగతిన అందించేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కే.ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, డ్వామా పీడీ రాము తదితరులు పాల్గొన్నారు.



ఇల్లిందలపర్రులో కుళ్లిన వరి దుబ్బులను మంత్రులకు చూపిస్తున్న రైతులు

ప్రజలకు ఏ ఇబ్బందులు రానివ్వం..

వేలేరుపాడు : వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో వరద పరిస్థితిని మంత్రులు పరిశీలించారు. వరదల కారణంగా ప్రభుత్వపరంగా అందిస్తున్న సాయంపై ఆరా తీశారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌తో సహా అధికారులంతా తమను బాగానే చూసుకుంటున్నారని బియ్యం, నిత్యావసర సరుకులు అందించారని ప్రజలు చెప్పడంతో మంత్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. వరద చుట్టుముట్టిన గ్రామాల ప్రజలకు కుటుంబానికి రూ.3 వేలు చొప్పున సాయం అందిస్తామని మంత్రులు చెప్పడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో కొంతమందికే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చారని ఇంకా 65 కుటుంబాలకు తమ గ్రామంలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని గిరిజనులు మంత్రులకు విన్నవించారు. తమ ప్రభుత్వం కొత్తగా వచ్చిందని కొంచెం కుదుటపడ్డాక అందరికీ ప్యాకేజీ చెల్లిస్తామని కొంచెం ఓపిక పట్టాలని సూచించారు. అనంతరం శివకాశీపురం ఆశ్రం పాఠశాలలో అధికా రులతో సమీక్ష నిర్వహించి వరదలు తీవ్రమైతే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

దువ్వలో...

తణుకు : తణుకు మండలం దువ్వ గ్రామంలో ఎమ్మెల్యే ఆరి మిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో మంత్రులు శనివారం సాయంత్రం పరి శీలించారు. దువ్వ వయ్యేరు కాలువపై ఉన్న పాత వంతెన పరిశీలించారు. నీట మునిగిన వరిపొలాలను పరిశీలించారు. అనంతరం అత్తిలి మండలం వరిఘేడు, తిరుపతిపురం గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు.

ఎస్. ఇల్లిందలపర్రులో..

పెనుమంట్ర : ఇది ప్రకృతి వైపరీత్యం కాదు..గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యమే.. కాలువలను, డ్రెయినేజీలను ఐదేళ్లలో కనీసం పట్టించుకోక పోవడంతో తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయి డ్రెయిన్లు లాగక పొలాలు ముంపు బారిన పడ్డాయని మంత్రి ఆరోపించారు. పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లిందలపర్రులో గోస్తనీ నది, జిఅండ్‌వీ కెనాల్ పోటెత్తడంతో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో ఇష్టా గోష్ఠి నిర్వహించారు. రైతులు కౌలు రైతులను ఆదుకోవాలని విత్తనాలు సరఫరా చేయాలని, భవిష్యత్తులో పొలాలు ముంపు బారిన వాటిల్లకుండా శాశ్వత పరిష్కారం చేయాలని పలువురు రైతులు మొరపెట్టుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వచ్చే వేసవిలో జిఅండ్‌వీ కెనాల్, గోస్తనీ నది ఆధునీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. గత వైసీపీ పాలకులు రైతుల ఖాతాలో ధాన్యం సొమ్ము జమ చేయలేదని 1600 కోట్ల రూపాయలు బకాయిలు పెడితే నాబార్డు నుంచి వెయ్యి కోట్లు అప్పు తెచ్చి రైతుల ఖాతాలో జమ చేశామన్నారు .మరో రూ.600 కోట్లు ఐదు ఆరు రోజుల్లో జమ చేస్తామని చెప్పారు.ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరుమిల్లి రాధాకృష్ణ ఉన్నారు.



ఇంతకు ముందెప్పుడూ ఇలా రాలేదు..

మంత్రుల ఎదుట ఆనందం వ్యక్తం చేసిన బాధితులు

కుక్కునూరు : వరద బాధితుల సమస్యలు తెలుసుకోవడానికి మంత్రులు కుక్కునూరులోని దాచారం పునరావాస కాలనీలో నిర్వాసితులతో బేటీ అయ్యారు. అధికారులు తమకు చేసిన సేవలను వారంతా మంత్రుల ఎదుట సంతోషంగా వ్యక్తం చేశారు. “వరద పెరుగుతుందని తెలిసిన వెంటనే కలెక్టర్ వెట్రిసెల్వి, మండల ప్రత్యేకాధిరులు, స్థానికాధికారులు మా గ్రామా నికి విచ్చేశారు. ఇళ్లు ఖాళీ చేసేందుకు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాలకు తీసుకొచ్చారు. విద్యుత్ సౌకర్యం, తాగునీరు ఏర్పాటు చేశారు. 3 రోజుల పాటు భోజనవసతి ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించటంతో మేమే వండు కుని తింటున్నాం. అధికారులు రోజు వస్తున్నారు...మీకేం కావాలని పదేపదే అడుగుతున్నారు. మాకు కష్టం లేకుండా చూస్తున్నారు..”అని కొమ్ము గూడెంకు చెందిన సముద్రాల రజిత చెప్పుకొచ్చారు. ఇంతకు ముందె ప్పుడూ ఇలా ఎవరూ రాలేదని బెస్త గూడెం గ్రామానికి చెందిన బొల్లు కృష్ణార్జునరావు తెలి పారు. నిజంగా అందుతున్నాయా లేక అలా చెప్పమం టున్నారా అని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించగా అలా ఏమీ లేదని అధికారులు బాగా చూస్తున్నారని బాధితులు తెలిపారు.

బాధితులకు రూ.3 వేలు నగదు,నిత్యావసర సరుకులు

దాచారం పునరావాస కాలనీలో ఉంటున్న 250 మంది గొమ్ముగూడెం నిర్వాసితులకు 25 కేజీల బియ్యం, 3 వేలు నగదు, కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పామాయిల్ అందజేశారు. మూడు పునరావాస కేంద్రాల్లోని దాదాపు 1200 కుటుంబాలకు సహాయం అందించారు. దువ్వలో 1,198 వరద బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

గ్రామాల్లో ‘టీమ్ ఏలూరు’

విపత్కర పరిస్థితుల్లో సాయం చేసేందుకు ముందుకు రండి

కొత్త పద్ధతికి నాంది పలికిన కలెక్టర్ వెట్రిసెల్వి



కుక్కునూరు : దాచారం పునరావాస కాలనీలో శనివారం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వరదబాధితులతో మాట్లాడుతూ ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెప్పారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో టీమ్ ఏలూరు ఏర్పాటు చేశామని గ్రామాల్లో విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు వీరంతా సాయం చేయా లన్నారు.. వలంటీర్లుగా సేవలందించేందుకు ప్రతీ గ్రామం నుంచి ఎవరైనా ముందుకు రావచ్చన్నారు. వారికి ప్రత్యేకంగా టీమ్ ఏలూరు పేరుతో టీషర్టులు అందిస్తాం.. వారంతా గ్రామాల్లో ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురైన వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించాలి. తద్వారా ఆ సమస్య పరిష్కారానికి అధికారులు వేగవంతంగా చర్యలు చేపడతారు. ప్రస్తుతం ముంపుబాధిత గ్రామాల నుంచి ఎవరైనా వలంటీర్లుగా సేవలందించడానికి ముందుకు వస్తారా అని కలెక్టర్ అడిగారు. దీంతో దాదాపు 15 మంది యువతీ యువకులు తమ గ్రామాల్లో పని చేయడానికి సిద్ధమైనట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ నవ్వుతూ మీ సేవకు జీతాలు మాత్రం ఉండవన్నారు. కొమ్ముగూడెం గ్రామం ముంపునకు గురవుతున్న సమయంలో ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామస్థులను పునరావాస కేంద్రాలకు తరలించడానికి సహకరించారు. కలెక్టర్ వారికి అభినందనలు తెలిపారు.

కొరియర్ కంపెనీ నుంచి అంటూ కాల్..



- ఆన్‌లైన్ మోసానికి భీమవరం వ్యక్తి బలి
- దఫదఫాలుగా రూ.7 లక్షలు కాజేశారు
- సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

భీమవరం క్రైం, జూలై 27 : “కొరియర్ కంపెనీ నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీకు ఒక కొరియర్ వచ్చింది. దానిలో కొన్ని అనుమానపు వస్తువులు ఉన్నాయి.” అంటూ బెదిరించి సుమారు ఏడు లక్షలు కాజేశారు.. ఆన్‌లైన్ దుండగలు. భీమవరం టూటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం 39వ వార్డు దుర్గాపురానికి చెందిన సింగవరపు గణేష్‌కు కొద్ది రోజుల క్రితం ఒక ఫోన్‌కాల్ వచ్చింది. తాము ముంబై పెడెక్స్ కొరియర్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పారు. నీకు ఒక పార్సిల్ వచ్చింది. అందులో అనుమానిత ఆరు పాస్‌పోర్టులు, రెండు పెన్‌డ్రైవ్‌లు ఉన్నాయని ఆ విషయం ముంబై పోలీసులకు తెలిసిపోయిందని ఫోన్ చేశారు. అనంతరం మరో నెంబర్ నుంచి గణేష్‌కు ఫోన్ వచ్చింది.నీకు వచ్చిన పార్సిల్ అనుమానాస్పదంగా ఉందని అలాగే నీపేరున ఉన్న కొన్ని బ్యాంక్ అకౌంట్‌లుపై అనుమానం ఉందని ఆ అకౌంట్‌లకు డబ్బులు జమ చేయాలని తెలపడంతో గణేష్ తన వద్ద డబ్బులు లేవని చెప్పాడు. దీంతో అవతలివారు మేము చెప్పిన విధంగా చెయ్యమని ఫేక్ అకౌంట్ ద్వారా గణేష్ పేరుమీద ఐసీఐసీఐ బ్యాంక్‌లో 16 లక్షల పదకొండువేల ఏడువందల నలభై ఒక్క రూపాయలకు లోన్ తీసుకునేలా చేశారు. అనంతరం ఆ సొమ్మును తాము చెప్పిన అకౌంట్లుకు ట్రాన్స్‌ఫర్ చెయ్యాలని గణేష్‌ను ఆదేశించారు. అది నమ్మిన గణేష్ నాలుగు అకౌంట్లుకు సుమారు రూ.7 లక్షలు వరకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తరువాత అనుమానం వచ్చిన గణేష్ సైబర్‌క్రైం టోల్‌ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చెయ్యడంతో అసలు విషయం బయటకు వచ్చింది. వెంటనే స్పందించిన సైబర్ క్రైం పోలీసులు లోకల్ పోలీసులు ఆధ్వర్యంలో ఆ అకౌంట్లలో ఉన్న సుమారు 5 లక్షలు రూపాయలను ఫ్రీజ్ చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎవరూ కూడా నకిలీ ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని ఏదైనా అనుమానం వస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చెయ్యాలని సీఐ కోరారు.

ఏపీకే లింకుల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఏలూరు క్రైం, జూలై 27 : మొబైల్ ఫోన్‌లోని వాట్సప్‌లలో ఏపీకె లింకు ఫైల్స్‌ను కొంతమంది తెలియక ఫార్వాడ్ చేస్తున్నారని ఇలాంటి వాటిని ఎవరైనా క్లిక్ చేస్తే వెంటనే ఆ మొబైల్ హ్యాక్ అయి అకౌంట్‌లో ఉన్న నగదు మొత్తం పోతుందని జిల్లా సైబర్ సెల్ అధికారులు సూచిస్తున్నారు. ఇలాంటి లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎవరైనా ఏపీకే ఫైల్స్‌ను పంపిస్తే క్లిక్ చేయవద్దని వెంటనే డిలీట్ చేయాలని సూచించారు.

క్రైం కార్నర్



బాదంపూడి వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం

కారు..ట్రావెల్ బస్సు ఢీ..నలుగురికి గాయాలు

ఉంగుటూరు, జూలై 27 : ఉంగుటూరు మండలం బాదంపూడి వై జంక్షన్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. హైదరాబాదు నుంచి యానాం వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తాడేపల్లిగూడెం వైపు మలుపు తిప్పుతున్న సమయంలో వాడపల్లి నుంచి విజయవాడ వెళుతున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్ కే.తేజ, ఐ.శ్రీనివాస్, పందేశ్, దావానీలు గాయపడ్డారు. గాయపడిన వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు

పట్టపగలే మోటారు చోరీ

ఏలూరు క్రైం, జూలై 27 : నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మోటారును ఓ దొంగ పట్టపగలే అపహరించుకుపోయాడు. బాధితుడు దీనిపై ఏలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏలూరు రూరల్ పరిధిలో అండాళ్ళమ్మ తోటలో ఓ ఇంటి నిర్మాణం జరుగుతుండగా ప్రాంగణంలో మోటార్లను ఏర్పాటు చేశారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం పట్టపగలే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ దొంగ ఆ మోటారును అపహరించుకుపోయాడు.మోటారును దొంగిలించడం, ద్విచక్ర వాహనంపై రావడం ఇవన్నీ అక్కడ సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఇంటి యజమాని కె.శ్రీనివాస్ సీసీ ఫుటేజ్‌లను ఏలూరు రూరల్ పోలీసులకు అప్పగించి ఈ చోరీపై ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూలై 27 :ఏలూరు సమీపంలోని వట్లూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఒక గుర్తు తెలియని వృద్ధుడు శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్‌కు సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 70 ఏళ్ళ వయస్సు కల్గి, 5.5 అడుగుల ఎత్తు, తెల్లని జుత్తు, తెల్లని గడ్డం కల్గి ఉన్నాడు. ఎరుపు రంగు పొట్టి చేతుల షర్టు, కాషాయరంగు లుంగీ, కాషాయరంగు టవల్ ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ సెల్ నెంబర్ 99892 19559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

కట్నం కేసు నమోదు

భీమవరం క్రైం, జూలై 27 : తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన పట్టపు లక్ష్మీప్రసన్న టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. లక్ష్మీప్రసన్నకు రాయలం గ్రామానికి చెందిన గంగాప్రసాద్‌తో కొంత కాలం క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు సంతానం.. కొంతకాలంగా కట్నం తీసుకువ్మని వేధించడమే కాకుండా శుక్రవారం రాత్రి పూటుగా మద్యం సేవించి వచ్చి ఇబ్బందులకు గురి చెయ్యడంతో ఆమె ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.



బస్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

ఆగి వున్న లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

వృద్ధురాలి మృతి.. పలువురికి గాయాలు

పెదపాడు, జూలై 27 :విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని అమ్మవారికి పసుపు-కుంకుమ సమర్పించేందుకు వారంతా యాత్రగా బస్‌లో బయలుదేరారు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం వారు ప్రయాణిస్తున్న ట్రావెల్ బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన 29 మంది ఆషాడమాసంలో అమ్మవారిని దర్శించుకునేందుకు అంతా కలిసి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో శుక్రవారం సాయంత్రం బయలుదేరారు. తెల్లవారు జాము 5.30 గంటల ప్రాంతంలో కలపర్రు వద్ద జాతీయ రహదారిపై హోటల్ ముందు ఆగి ఉన్న లారీని బస్ అతివేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో పెద్దూరు గ్రామం, గురుపల్లి మండలం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ముగడ కృష్ణమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందగా బస్ డ్రైవర్ కిలారి లక్ష్మణరావుకు కాలిలో ఇనుపచువ్వ బలంగా దిగబడింది. బస్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసేందుకు పోలీసులతో పాటు పలువురు తీవ్రంగా శ్రమించారు.గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతిరాలి బంధువు హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కలెక్టర్ ఆదేశాలతో ఏలూరు ఆర్డీవో ఖాజావలి, పెదపాడు ఎమ్మార్వో భావనారాయణ, ఏలూరు ఎమ్మార్వో మురార్జీ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 16 మంది స్వల్ప గాయాలవగా వారందరికీ ప్రాథమిక చికిత్స చేయించి వారందరిని స్వస్థలానికి వెళ్లేలా వాహనాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

బాలికపై అత్యాచారం..

ఆకివీడు, జూలై 27 : తన కుమార్తెను యువకులు అత్యాచారం చేశారని శుక్రవారం బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉండి గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఆకివీడు మండలానికి చెందిన వివాహమైన వ్యక్తి మోటారు సైకిల్‌పై తీసుకెళ్లి వివాహం అయిన మరో వ్యక్తితో కలిసి దుంపగడప శివారు ఉప్పుటేరు దగ్గర అత్యాచారం చేశారని తండ్రి ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ పర్యవేక్షణలో శనివారం ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు.

అసభ్యంగా ప్రవరిస్తున్నాడని చాకుతో పొడిచిన యువతి

తీవ్రగాయాలు..ఏలూరు ఆసుపత్రికి తరలింపు




దాడిచేసిన యువతి.. గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

ద్వారకా తిరుమల, జూలై 27: మానసిక స్థితి సక్రమంగా లేని ఓ యువతి తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై చాకుతో దాడి చేసింది. ద్వారకాతిరుమల ఆలయ పాత కల్యాణ మండపంలో నిద్రిస్తున్న ఆ వ్యక్తి చేతిపైన, ముఖంపైన పొడవడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని హుటాహుటిన దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేసిన వైద్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ద్వారకా తిరుమలకు చెందిన తిరునగిరి రమేష్ మద్యం సేవించి దుబారాగా తిరుగుతుంటాడు. ఈ క్రమంలో ఈమెతో కొద్దిరోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో ఆ యువతి అతను మండపంలో నిద్రిస్తున్న సమయంలో చాకుతో దాడికి తెగబడింది. అతని చేతిపైన, ముఖంపైనా దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతని పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది. ఆ యువతి నెలరోజులుగా ఇక్కడిక్కడే తిరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.



డీడీవోలుగా పదోన్నతి పొందిన కార్యదర్శులను అభినందిస్తున్న తాడేపల్లిగూడెం ఎంపీడీవో శర్మ

సచివాలయ కార్యదర్శుల్లో ఆనందం..

325 మంది కార్యదర్శులకు డీడీవో హోదా

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 27: సచివాలయ కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత వైసీపీ సర్కారు సచివాలయ అధికారులుగా నియమించి త్రిశంకు స్వర్గంలో వదిలేసిన వారికి డీడీవో (డ్రాయింగ్, డిజ్బర్స్ ఆఫీసర్)లుగా పదోన్నతి కల్పించింది. గతంలో సచివాలయాల్లో పేరుకే కార్యదర్శులుగా మిగిలిన గ్రేడ్-5 సచివాలయ కార్యదర్శులకు పూర్తి బాధ్యతలు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 325 మంది సచివాలయ కార్యదర్శులకు డీడీవో హోదా లభించినట్టయింది. ఫలితంగా గ్రామ పంచాయతీల్లో చేసే ఖర్చులు, ఉద్యోగుల జీతాలు అందించడానికి కార్యదర్శులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్టయింది. వైసీపీ ప్రభుత్వం మొదటి నుంచి సచివాలయ ఉద్యోగులపై వివక్షత చూపుతూనే వచ్చింది. తాము ఏదో కొత్త వ్యవస్థను తీసుకొచ్చామని డప్పు కొట్టుకోవడం తప్ప వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారింది. సచివాలయ కార్యదర్శులు కేవలం గుమస్తాలుగానే పనిచేయాల్సి వచ్చింది. గ్రామంలో కచ్చా డ్రెయిన్ పూడిక తీయాలన్నా ఆ సచివాలయానికి సమీపంలో ఉండే గ్రేడ్-1 ఈవోల వద్దకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. సచివాలయ కార్యదర్శులకు స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా పోయింది. ఎన్నికల ముందు డీడీవోగా పదోన్నతి ఇస్తున్నట్టు వైసీపీ ప్రభుత్వం మొక్కుబడిగా జీవో ఇచ్చింది. ఇచ్చిన మూడు రోజుల్లోనే ఎన్నికల కోడ్ రావడంతో ఆ జీవో నీరుగారిపోయింది.



మాట్లాడుతున్న న్యాయాధికారి రత్న ప్రసాద్

మారుతున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు క్రైం, జూలై 27: మారుతున్న చట్టాలపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అవగాహన కల్పించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రత్యేక జువైనల్ పోలీసులకు ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ బాలలను ఏ విధంగా కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అందించాల్సిన సౌకర్యాలపైన అవగాహన కల్గించుకోవాలని సూచించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి బులికృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగం బాలలకు కొన్ని హక్కులు కల్పించిందని వాటిని కాపాడడమే న్యాయస్థానాల ముఖ్య ఉద్దేశమన్నారు.వాటిని ఖచ్చితంగా అమలు పరిచే పోలీసులకు, ఇతర అధికారులకు వీటిపై పూర్తి అవగాహన కల్గించాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి మాట్లాడుతూ న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు అందిస్తున్న అవగాహన సదస్సులకు హాజరు కావడమే కాకుండా వాటిని నిబద్ధతతో అమలు పరిచి సమాజ సేవలో అధికారులు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో సూర్య చక్రవేణి, ప్రొబెషనర్ ఆఫీసర్ డి.దుర్గాప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, ప్యానల్ న్యాయవాదులు తిగిరిపల్లి సుబ్బారావు, కె.వెంకటేశ్వరరావు, కృష్ణారావు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, సీడబ్ల్యూసీ సిబ్బంది, ఇతర అధికారులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి


ప్రకాశం చౌక్‌లో ధర్నా చేస్తున్న, శ్రామిక, ఐద్వా మహిళా సంఘ నాయకులు

భీమవరం అర్బన్, జూలై 27 : చిన్నారులపై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని శ్రామిక మహిళా నాయకురాలు డి.కళ్యాణి, ఐద్వా నాయకురాలు సరోజిని డిమాండ్ చేశారు. అత్యాచారా లను ఖండిస్తూ ప్రకాశం చౌక్‌లో శనివారం శ్రామిక మహిళ సంఘం, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో రోజురోజుకి మహిళలపై, చిన్నారులపైన అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. అత్యాచారాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రామిక నాయకురాలు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు డి.జ్యోతి, లారెన్స్ కుమారి, వరలక్ష్మి, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి కేవీపీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

భీమవరం అర్బన్, జూలై 27: భీమవరంలో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులు ఆగస్టు 12, 13, 14వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ తెలిపారు. శనివారం కేవీపీఎస్ ముఖ్యకార్తకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళిత సంక్షేమంపై సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో దళితులు, వెనుకబడిన తరగతుల ప్రజలు అభివృద్ధికి నిరంతరం కేవీపీఎస్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ సమస్యలు ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం

గణపవరం, జూలై 27: గణపవరంలోని చింతలపాటి బాపిరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మౌలిక సదుపాయల కల్పనకు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దృష్టికి తీసుకెళ్తామని గణపవరం టీడీపీ, జనసేన నాయకులు తెలిపారు. శనివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కాపారం చిన్న, జనసేన నాయకుడు కూసంపూడి జగపతిరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు హైస్కూల్‌ను పరిశీలించారు. పాత హైస్కూల్ భవనం శిథిలావస్థకు చేరుకుందని సమస్యలను నేతల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

హెల్మెట్‌లు తప్పనిసరిగా ధరించాలి

గణపవరం, జూలై 27: ప్రాణాలకన్నా విలువైనది ఏమి లేదని వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ.నిర్మలకుమారి విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు సీహెచ్ చైతన్య, స్వరూపరాణి, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఆర్‌డీఎస్ కాలేజీలో నాక్ బృందం పరిశీలన

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 27 :ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని గుజరాత్‌లోని బరోడాకి చెందిన మహరాజా సామోజీరావు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ప్రజ్ఞేషా అన్నారు. ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న నాక్ బృందం పరిశీలన శనివారంతో ముగిసింది. నాక్ సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోటేష్, డాక్టర్ జార్జి వి.థామస్ మాట్లాడుతూ త్వరలోనే కళాశాల ఉన్నత స్థానాన్ని పొంద నుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేఏజే ప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత, ఐక్యూఏఎల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.అరవిందస్వామి, ఇతర సిబ్బంది నాక్ పీర్ టీమ్ సభ్యులను సత్కరించారు. నాక్ నివేదికను ప్రిన్సిపాల్‌కు అందించారు.

'ఎన్ఎంఎంఎస్‌పై అవగాహన కల్పించాలి'

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 27 : 2024-25 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తులు అతి త్వరలో ఆహ్వానిస్తారని, ఈ పరీక్షకు విద్యార్థులు తమ పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు పాఠశాల రికార్డులలోను, ఆధార్ కార్డులోనూ ఒకే విధంగా ఉన్నవో లేదో పరిశీలించుకునేలా హెచ్‌ఎంలు అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో ఈ ఏడాది ఎనిమిదో తరగతి చదువుతున్న కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులని తెలిపారు.

తలసేమియా శాశ్వత నివారణకు కృషిచేద్దాం

భీమవరంటౌన్, జూలై 27 :తలసేమియా శాశ్వత నివారణకు కృషి చేద్దామని ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చందన, చిన్నపిల్లల వైద్యులు జి.రామకృష్ణంరాజు అన్నారు. టౌన్ రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రైమ్ స్కాన్ సెంటర్‌లో ఏఎస్ఎన్ రాజు ట్రస్ట్, ధాత్రి ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం ఉచిత హెచ్ఎల్ఏ పరీక్షలను శనివారం నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ తలసేమియా పిల్లలతో పాటు వారి కుటుంబీకులు ముగ్గురు గాని, నలుగురు గాని ఒక్కొక్కరికి రూ. 10 వేలు విలువైన హెచ్ఎల్ఏ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. దీనిద్వారా అర్హులైన వారికి బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకునే విధంగా మా సంస్థలు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

సెంట్రల్ ట్రైబల్ వర్సిటీలో డీఎన్ఆర్ విద్యార్థినికి సీటు

పాలకొల్లు అర్బన్, జూలై 27 : స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని శెట్టి సునీత విజయనగరంలోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీలో కెమిస్ట్రీ పీజీ సీటు సంపాదించింది. ఈ సందర్భంగా విద్యార్థిని సునీతను కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శోభారాణి, అధ్యాపకులు అభినందించారు. పీజీ సెట్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ విజయ్ స్వరూప్‌సింగ్, విజయలక్ష్మిలను అభినందించారు.

'ఆదర్శనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం'

మొగల్తూరు, జూలై 27 : క్షిపణి మేధావి, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆదర్శనీయుడని ముత్యాలపల్లి ఉన్నతపాఠశాల హెచ్‌ఎం పి.రామరాజు తెలిపారు. శనివారం కలాం వర్ధంతిని పురస్కరించుకుని పాఠశాలలో వున్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కలాం సూచించిన మార్గదర్శకాలు పాటిస్తే ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. నాగిడి రాంబాబు, వాటాల మాధవరాజు, రాజేంద్రబాబు, బర్రి శ్రీను, దొంగ రాంప్రసాద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఉండి జూలై 27:** కౌలు రైతులు, రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి ఆదుకోవాలని పాండువ్వలోని గ్రామ కార్యదర్శికి వినతి పత్రాన్నికౌలు రైతుల సంఘం మండల సభ్యుడు మాదాసి గోపి అందించారు.
- ఆకివీడు : వైసీపీ ప్రభుత్వం భూకబ్జా చేయాలనే దురుద్దేశ్యంతో రైతును వ్యవసాయానికి దూరం చేసే విధంగా పాలన సాగించారని స్థానిక బీదర్ కోడ్, గంగానమ్మకోడ్ పరిధిలో ముంపు పొలాలను పరిశీలించిన అనంతరం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు, జిల్లా అధ్యక్షుడు దాసరి బాబి అన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : జగన్నాథపురం, అప్పారావుపేట గ్రామాల్లో వరద ముంపు ప్రాంతాలను మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.
- పెనుగొండ : భాష్యం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎస్.వెంకటఅప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. జోనల్ ఇన్‌చార్జి ఎ.శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇన్‌చార్జి రాణిరోజాజి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.
- భీమవరం క్రైం : డీఎన్నార్ లా కళాశాల ఆధ్వర్యంలో మూడు, ఐదు సంవత్సరాల లా సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమాన్ని కళాశాల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, కో-ఆర్డినేటర్ ఎంవీ కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘురామ్ ఆధ్వర్యంలో అందించారు 2023-24 విద్యా సంవత్సరంలో ఎల్ఎల్‌బీలో 85శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు.
- పెనుగొండ, పెనుమంట్ర : పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామ వైసీపీ అభిమాని నక్కా శ్రీను ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో శ్రీను కుటుంబాన్ని, పెనుమంట్ర మండలం పెనుమంట్ర జడ్పీటీసీ కర్రీ గౌరీ సుభాషిని వేణుబాబు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు శనివారం పరామర్శించారు.

ఏ ఒక్క రైతూ నష్టపోకూడదు

▸▸ శాశ్వత పరిష్కారం కోసం పనులు గుర్తించి ప్రతిపాదనలు ఇవ్వండి

రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

తణుకు, జూలై 27: వరి పొలాలు ముంపునకు గురైన ఏ ఒక్క రైతు నష్టపోకూడదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం రాత్రి జిల్లా అధికారులతో పంట నష్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నష్టం వివరాలు రెవెన్యూ, వ్యవసాయ శాఖలు పక్కాగా సర్వే చేసి అందించాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో డ్రెయిన్లు, కాల్వల పూడిక తీత లేకపోవడం వల్లే ఇప్పుడు రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గోదావరి ఉధృతి పెరిగినందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలకు కావాల్సినవన్నీ సమకూరుస్తామన్నారు. లంక గ్రామాల్లో పునరావాస కేంద్రాలకు తరలించి భోజన వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ఆయా ప్రాంతాల్లో ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చ రించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు రూ.మూడు వేల చొప్పున అందజేస్తామన్నారు.

- రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఇరిగేషన్‌కు సంబంధించి అన్ని పనులను గుర్తించి శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. గోదావరి కరకట్ట ప్రాంతంలో బలహీన ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలానికి నోడల్ అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో ఉండేలా ఆదేశించాలన్నారు.
- హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలు కారణంగా ఏ ఒక్క రైతు నష్టపోకూడదన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని అన్ని ముందస్తు చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టామన్నారు.
- ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రతియేటా ముంపు వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.
- ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, వ్యవసాయ శాఖ డైరెక్టరు ఢిల్లీ రావు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, డీఆర్వో ఉదయ భాస్కరరావు, ఆర్డీవో అంబరీష్, జేడీ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఈఈ దక్షిణామూర్తి మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, కలగర వెంకటకృష్ణ, బసవ రామకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, పరిమి వెంకన్నబాబు, వావిలాల సరళాదేవి, పితాని మోహన్ పాల్గొన్నారు.




దుర్గాపురంలో బియ్యం అందజేస్తున్న నాయకులు.. ఆహార పొట్లాలు అందిస్తున్న బాడీ బిల్డింగ్ సభ్యులు.. రగ్గులు అందించిన వివేకానంద సమితి సభ్యులు

ముంపు బాధితులకు బియ్యం అందజేత

భీమవరంటౌన్, జూలై 27 : స్థానిక దుర్గాపురం 38వ వార్డులోని 200 మంది ముంపు బాధితులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. స్థానిక నాయకులు గంటా శివప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతం పట్టణానికి శివారుగా ఉందని, యనమదుర్రు పొంగగానే మొదట మునిగే ప్రాంతం ఇదేనని, దాతలు స్పందించి బియ్యం అందించడం అభినందనీయమన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రముఖ వ్యాపార వేత్తలు వీఎస్‌కే కళాశాల వ్యవస్థాపకులు వబిలిశెట్టి పట్టబిరామయ్య, వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో 200 మందికి బియ్యం అందించామని తెలిపారు. కొండ్రు శ్రీనివాస్, అనగాని కృష్ణప్రసాద్, యూత్ సభ్యులు గొర్రెల గోపి, బి.చిన్నా, ఉండ్రు సత్యనారయణ, పి.చిన్నా, ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

భీమవరం అర్బన్, జూలై 27: ఆకాల వర్షాల కారణంగా జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు సహకారం అందించడం మన ధర్మం అని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కటారి రవిశంకర్ అన్నారు. మెంటేవారి తోట ముంపు బాధిత కుటుంబాలకు శనివారం బాడీ బిల్డింగ్ అసోసియేషన్, ఐకాన్ జిమ్ సెంటర్‌ల ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లు అందించారు. కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు, షేక్ కాసీమ్, మెంటేకాశీ, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రగ్గులు, ఆహార పొట్లాలు..

భీమవరంటౌన్, జూలై 27 మానవసేవయే మాధవసేవ అని, సేవా గుణమే ఉత్తములుగా తీర్చిదిద్దుతుందని వివేకానంద సేవా సమితి కార్యదర్శి నారాయణరాజు అన్నారు. స్థానిక వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వివేకానంద సేవా సమితి సహకారంతో 32 మంది దివ్యాంగులకు రగ్గులు, ఆహార పొట్లాలను అందించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వివేకానంద సేవా కార్యక్రమాల్లో భాగంగా దివ్యాంగులకు రగ్గులు, ఆహార పొట్లాలు అందించామని తెలిపారు. నందమూరి రాజేష్, కొండ్రు శ్రీనివాస్, వడ్డి సుబ్బారావు, పులపర్తి శ్రీను పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 27: తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి జూన్ 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డీపీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-24లో ర్యాంకు వచ్చి ఇతర కళాశాలల్లో చేరని వారు, పాలిటెక్నిక్‌లో అర్హత సాధించని వారు, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు హాజరు కావచ్చని వివరించారు. సివిల్, మెకానికల్ విభాగాల్లో కొన్ని ఖాళీలు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, మూడు జతల జిరాక్స్ కాపీలు, 3 ఫోటోలు తీసుకుని జూలై 31న ఉదయం 10 గంటలకు పాలిటెక్నిక్ కళాశాలకు హాజరు కావాలని సూచించారు. ఫీజు తదితర వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

పంచాయతీ చెరువుల వేలం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 27:పంచాయతీల చెరువులను పాటదారులు నిబంధనల ప్రకారం సాగు చేయాలని పంచాయతీల విస్తరణాధికారి ఎం. వెంకటేష్ సూచించారు. శనివారం కొండ్రుప్రోలు పంచాయతీ చెరువుల వేలం నిర్వహించారు. గూరమ్మ చెరువు రూ.13.5 లక్షలు, పేరయ్య చెరువు రూ.9.2 లక్షలు, అంబాదేవి చెరువు రూ.15.25లక్షలు, తుంబలకుంట చెరువు రూ.76వేలు, పిల్లకర్ర చెరువు రూ.3వేలకు పాడినట్టు కార్యదర్శి హరికిషోర్ తెలిపారు. కూటమి నాయకులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, జూలై 27: మరమ్మతు పనుల్లో భాగంగా మండలంలోని ప్రత్తిపాడుతో పాటు గ్రామ పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో ఆదివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు డీఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ ప్రాంతాల్లోని వినియోదారులు సహకరించాలన్నారు.

కాల్వలు కలుషితం చేస్తే చర్యలు తప్పవు

పెంటపాడు, జూలై 27: ప్రజలకు సాగు, తాగు నీరు అందించే కాలువలను కలుషితం చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఏలూరు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎనలిస్ట్ తేజస్విని హెచ్చరించారు. మండలంలోని మిడ్‌లెవల్ కాలువలో సమీప ఫ్యాక్టరీల వ్యర్థాలు కలువడం వల్ల సాగు, తాగునీరు కలుషితం అవుతోందని రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాల్లోని పలువురి ఫిర్యాదు మేరకు శనివారం ఆమె పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీల సమీపంలోని నీటి శాంపిల్స్ తీసుకున్నారు. ఎంపీడీవో బాలాజీ వెంకట రమణ, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో కొరవడిన పారిశుధ్యం

అత్తిలి, జూలై 27: అత్తిలి పంచాయతీ పరిధిలో పారిశుధ్యం కొరవడింది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగాలేక మురుగునీరు నిలబడి దోమల తీవ్రత ఎక్కువగా ఉంది. అత్తిలిలో డంపింగ్ యార్డు ఉన్నా చెత్తను తరలించకుండా ఆయా ప్రాంతాల్లో నిల్వ ఉంచడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అధ్యాపకుడు పెద్దిరాజుకు డాక్టరేట్

ఆకివీడు, జూలై 27 : దుంపగడప ఏకేపీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆవాల పెద్దిరాజు డాక్టరేట్ సాధించినట్టు శనివారం ఆయన విలేకరులకు తెలిపారు. మద్రాస్ అవర్నెస్ అండ్ యూజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్ ఎమాంగ్ ద ఫ్యాకల్టీ మెంబర్స్ అండ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీ లైబ్రరస్ ఇన్ వెస్ట్ గోదావరి అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చిందన్నారు. ఆయనను ఏకే పీఎస్, వీవీగిరి డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ బలరామ్ ప్రతాప్‌కుమార్, తాడినాడ బాబు, అధ్యాపకులు అభినందించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అరన్, జూలై 27 : ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీహెచ్ లక్ష్మి అధ్యక్షతన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం జరిగింది. గత ప్రభుత్వంలో అనేక ఉద్యమాలతో కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని మరి కొన్ని ఆ ప్రభుత్వం అంగీకరించి ఎన్నికల్లో ఓటమి పాలవడంతో కొత్తప్రభుత్వంపై పడిందన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేస్తుందని ఆశతో ఉన్నారన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. లారెన్స్ కుమారి, జయంతి, ప్రశాంతి, లక్ష్మి కుమారి, వరలక్ష్మి, రాజేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు ఆక్రమణల తొలగింపు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 27: తాడేపల్లిగూడెం బస్టాండ్ పక్క నుంచి గణేష్ నగర్ వెళ్లే రహదారి విస్తరణ పనులను మున్సిపల్ అధికారులు శనివారం చేపట్టారు. ఈ రహదారిలో బస్సులు తప్పుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో 6 అడుగుల వరకు రోడ్డు మార్జిన్ పెంచేందుకు ఆక్రమణలను తొలగించే చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్‌తో రహదారి పైకి వచ్చిన ఆక్రమణలను తొలగిస్తున్నారు.

బాల్య వివాహాలు నేరం


తణుకు ఎంపీపీ స్కూలులో అవగాహన కార్యక్రమం

తణుకు/అత్తిలి/పెంటపాడు, జూలై 27: బాల్య వివాహాలు నేరమని ఎంపీపీ స్కూలు నెం.4 హెచ్‌ఎం ఆర్.కర్నేల్ అన్నారు. శనివారం మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పి.నాగలక్ష్మి, మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అజయకుమారి, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు. అత్తిలి మండలం మంచిలి సెక్టార్ సూపర్‌వైజర్ పి.మహాలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తల తో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ సిబ్బంది పాల్గొన్నారు. పెంటపాడు మండలం వల్లూరుపల్లి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

భీమవరం మండల ఆర్య వైశ్య సంఘ నూతన కమిటీ


నూతన కమిటీకి నియామక పత్రాలను అందించిన ఎన్నికల అధికారి రాధాకృష్ణ

భీమవరంటౌన్, జూలై 27 : భీమవరం మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా యిన్నమూరి వెంకటశ్రీనివాసరావు, కార్యదర్శిగా రాజా బాల మస్తానయ్య, కోశాధికారిగా చల్లగండ్ల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఓలేటి వెంకటరాధాకృష్ణ తెలిపారు. మాజీ మంత్రి టీజీ వెంకటేష్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్య క్షుడు బొండాడ రామమోహనరావు సూచన మేరకు ఈ ఎన్నికలు నిర్వహించా మన్నారు.. నూతన కమిటీని పలువురు అభినందించారు.

మొదలైన డ్రెయిన్ల ప్రక్షాళన


కొవ్వాడ రాయలం డ్రెయిన్

భీమవరంటౌన్, జూలై 27 : భీమవరం నియోజకవర్గంలో తూడు, గుర్రపు డెక్కతో పూడికపోయిన డ్రెయిన్ల ప్రక్షాళన మొదలైంది. రెండు రోజుల క్రితం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు రైతుల సమస్యలు, డ్రెయిన్ల సమస్యలపై ప్రస్తావించారు. దీనిలో భాగంగా రాయలం, కొవ్వాడ అన్నవరం డ్రెయినేజీ ప్రక్షాళన మొదలైంది. రైతులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, బీవీ రాజు కళాశాల, ఆనంద శ్రీను ఆధ్వర్యంలో సుమారు నాలుగు కిలోమీటర్లు కొవ్వాడ అన్నవరం నుంచి ఉండి రోడ్డు వరకు డ్రెయిన్ల ప్రక్షాళన చేశారు. బీవీ రాజు కళాశాల, ఆనంద శ్రీను, జనసేన కార్యకర్తలను ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పెంటపాడు, జూలై 27: వరదలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నల్లమిల్లి విజయానందరెడ్డి అన్నారు. శనివారం మండలంలో ముంపునకు గురైన పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు తుఫాను కారణంగా తీవ్రంగా నష్టపోయారన్నారు. వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

ఆధ్యాత్మికం

పెంట్లమ్మ వారికి ఆషాఢ సారె


సారె తీసుకువెళ్తున్న మహిళలు

పెంటపాడు, జూలై 27: ఉమామహేశ్వరం గ్రామ దేవత పెంట్లమ్మ వారికి శనివారం గ్రామానికి చెందిన రాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలు మేళ తాళాలతో ఊరేగింపుగా ఆషాఢ సారె సమర్పించారు. భజన సమాజం మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

- వీరవాసరం(భీమవరంటౌన్) : వీరవాసరం మండలం నవుడూరు జంక్షన్‌లోని రమాసత్యనారాయణస్వామి ఆలయంలోని సరస్వతీ అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరణ చేశారు. అర్చకుడు వాడపల్లి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజల అనంతరం దాత పంజా నారాయణరావు అందించిన కూరగాయలతో అమ్మవారికి అలంకరణ చేశారు.
- పాలకొల్లు అర్బన్ : స్థానిక శ్రీదత్త జ్ఞాన బోధ సభ ఆధ్వర్యంలో గణపతి సచ్చిదానంద అవధూత ఆశీస్సులతో రెండు రోజుల పాటు నిర్వహించిన నవ కోటి దత్తహోమం మహా పూర్ణాహుతి కార్యక్రమం శనివారం సాయంత్రం పూర్తయింది. క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు సీహెచ్ రామలింగేశ్వరశాస్త్రి, ఎ.కృష్ణాజీ, సాయి వెంకటేశ్వరరావు, ఎ.సాయిరామ్, బీవీ వాసవీ దుర్గ, అంజిలి, ఆర్.జ్యోతి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్ : స్థానిక డైలీ మార్కెట్‌లోని వేంకటేశ్వర స్వామిఆలయంలో శనివారం సందర్భంగా అర్చక స్వామి గోవర్థనం కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తులసి మాలలతో అలంకరించారు. ఆలయంలో పలువురు మహిళలు విష్ణు, లలితా సహస్ర పారాయణ నిర్వహించారు.

శ్మశాన వాటిక ఆక్రమణదారులకు నోటీసులు

ఆకివీడు, జూలై 27 : స్థానిక అమృతరావునగర్ కాలనీ శ్మశాన వాటిక ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ శనివారం తెలిపారు. అమృతరావునగర్ కాలనీ శ్మశానంలో ఆరవై ఆరు కుటుంబాలు ఆక్రమించుకుని నివాసముంటున్నారు. వీరిలో పదిహేను మంది ఆస్తులు ఉన్నవారు, చనిపోయిన వారు ఉన్నారన్నారు. యాభై ఒక్క కుటుంబాలకు 2020లో కుప్పనపూడిలోని తాళ్లకోడులో పట్టాలిచ్చినప్పటికీ ఆక్రమణదారులు వెళ్లకపోవడంతో సాలిపేటకు చెందిన శలా భాస్కరరావు భీమవరం గ్రీవెన్ సెల్‌లో జేసీకి ఫిర్యాదు చేశారు. జేసీ ఆదేశాలతో తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి సర్వేచేసి నివేదిక అందించారు. ఆక్రమణదారులైన 51 కుటుంబాలకు మూడు నెలలు, మిగిలిన 15 కుటుంబాలకు వారం రోజుల్లో ఖాళీ చేయించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు ఆక్రమణాదారులకు నోటీసులు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి నోటీసులు జారీ చేశామన్నారు.

పన్ను చెల్లింపుదారులు తప్పుడు క్లైమ్ చేయొద్దు

భీమవరంటౌన్, జూలై 27 :పన్ను చెల్లింపుదారులు తప్పుడు క్లైమ్ చేయకూడదని, నిబంధనల మేరకు ఇన్‌కం టాక్స్ రిటర్న్స్ (ఐటీఆర్) ఫైలింగ్ చేయాలని ఆదాయపు పన్ను శాఖ అధికారి కొణతం సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఆదాయపు పన్ను విభాగం వారిచే ట్యాక్స్ రిటర్న్ ఫైలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రిటర్న్ ఫైలింగ్‌లో అన్ని రకాల ఆదాయ వివరాలు ఇవ్వాలని, తప్పుడు వివరాలు ఇవ్వకూడదన్నారు. ఐటీఆర్‌ను ఈనెల 31లోపు సమర్పిం చాలని, ఏమైనా సందేహాలు ఉంటే ఐటీ కార్యాల యంలో సంప్రదించ వచ్చన్నారు. ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, ఉద్యోగులు, ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం : పితాని

పెనుమంట్ర, జూలై 27 :దాతల సహకారంతో ప్రజలకు మినరల్ వాటర్ అందించేందుకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు శనివారం బట్లమగుటూరులో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. టీర్సక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తాడి వెంకట శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరును అందించారన్నారు. శ్రీనివాసరెడ్డిని పితాని అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచి బయ్య సుగుణమ్మ, జంగం చిట్టిబాబు, గంటా శ్రీనివాస్, పాలమూరి రాజేష్, బయ్యే బాలాజీ, ఎల్.పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలసిన వలవల


మంత్రి అచ్చెనాయుడితో మాట్లాడుతున్న బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 27: తణుకు మండలంలో ముంపునకు గురైన పొలాల పరిశీలనకు వచ్చిన రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారధి, రామానాయుడును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి శనివారం కలిశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ముంపునకు గురైన పొలాల పరిస్థితిని మంత్రులకు వివరించి రైతులను ఆదుకోవాలని కోరారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పరిమి రవికుమార్, వాడపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణం



రోటరీ నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు రూరల్, జూలై 27:పాలకొల్లు రోటరీ క్లబ్ నూతన కార్యవర సభ్యుల ప్రమాణ స్వీకారం స్థానిక లయన్స్ క్లబ్ హాల్లో శుక్రవారం రాత్రి వేడుకగా జరిగింది. ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ డీజీఎన్ గుత్తికొండ శ్రీరామ్, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ విచ్చేశారు. ముఖ్యఅతిథి శ్రీరామ్ నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రెసిడెంట్‌గా రావాడ వెంకట సత్యనారాయణ మూర్తి, కార్యద ర్శిగా జవ్వాది కళ్యాణ్, కోశాధికారిగా పొత్తాబత్తుల సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థికి పాఠ్యపుస్తకాలతో పాటు సైకిల్, ఇంటర్ విద్యార్థికి రూ. 24 వేలు అందజేశారు. మద్దాల రాంప్రసాద్, ఇమ్మిడి రాజేష్, ముచ్చర్ల సంజయ్, కావలి నగేష్, తదితరులు పాల్గొన్నారు

వేడుకగా త్యాగరాజ గాన సభ సంగీతోత్సవాలు

పెనుగొండ, జూలై 27 : శ్రీ త్యాగరాజ గాన సమితి ఆధ్వర్యంలో పెనుగొండలో గల శ్రీత్యాగరాజ కళా భవనంలో మూడు రోజుల పాటు త్యాగరాజ గాన సభ నిర్వహించే సంగీతోత్సవాలను శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. తొలుత కార్యక్రమాన్ని సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాత్ర సంగీత విభావరిని ప్రముఖ కళాకారిణి మధుర గాయని హరిచందన గాత్రం చేయగా విశాఖపట్టణానికి చెందిన ఆలిండియా రేడియో వైలన్ విద్వాన్ సరస్వతుల పార్థివ వయోలిన్, మృదంగ విద్వాంసులు మారుతి రఘురామ్ ఆధ్వర్యంలో గాత్ర సంగీత విభావరిని నిర్వహించారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పాలకోడేరు, జూలై 27: పాడిరైతులు పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని పశుసంపదను కాపాడుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ జేసురత్నం తెలిపారు. శనివారం వేండ్రలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమ పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ప్రాంతీయ పశువైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీదేవి, భీమవరం మండల పశువైద్యాధికారి సత్యదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కాళ్ల(ఉండి) జూలై 27: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం కాళ్ల మండలం కోపల్లె జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం నిర్మలాదేవి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలలో స్వచ్ఛందసంస్థలు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఎంఈవో కనకరాజు, ఐక్య ఫౌండేషన్ చైర్మన్ వై.శ్రీనివాసచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో చాంబర్స్ విద్యార్థుల ఎంపిక

పాలకొల్లు అర్బన్, జూలై 27 : స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో తమ కళాశాల విద్యార్థులు 20 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. హెటిరో ల్యాబ్స్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలలో 56 మంది హాజరు కాగా 20 మంది ఎంపిక అయ్యారని, వారికి నెలకు రూ. 25వేలు ఉంటుందని తెలిపారు. కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, కార్యదర్శి కలిదిండి రామరాజు, ఎంపికైన అభ్యర్థులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను అభినందించారు. హెటిరో ల్యాబ్స్ హెచ్ఆర్ నరేష్, వెంకట్, ప్లేస్మెంట్ ఇన్‌చార్జి యు.జానకీరామయ్య, టి.మీనా, సిబ్బంది పాల్గొన్నారు.